

కిలో రూ.12 లెక్కన నేటినుంచి తోతాపురి కొనుగోళ్లు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలను కిలో రూ.12 లెక్కన ఆదివారం నుంచే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి రాజమౌళి శనివారం రాత్రి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, శ్రీధర్‌లతో తోతాపురి మామిడి కొనుగోళ్లపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4.50లక్షల టన్నుల తోతాపురి దిగుబడి ఉంది. సీజన్ ప్రారంభమైనా అటు వ్యాపారులు కానీ, ఇటు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం కానీ తోతాపురిని కొనుగోలు చేయకపోవడంతో మామిడి రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది.బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.4 కూడా పలక్కడంతో మామిడి రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆదివారం నుంచి తోతాపురి మామిడి క్రయవిక్రయాలు యుద్ధప్రాతిపదికన జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మామిడి గుజ్జు పరిశ్రమలు కిలో మామిడికి రూ.8 చెల్లించనుండగా, ప్రభుత్వం రూ.4 మేర సబ్సిడీ రూపేణా చెల్లించనుంది. ఇందువల్ల ప్రభుత్వంపై రూ.160కోట్ల దాకా భారం పడనుందని అంచనా. ప్రభుత్వం నుంచి రూ.4 అదనంగా వస్తుండటంతో నేటినుంచి మామిడిపల్ప్ యూనిట్లు కూడా రైతులనుంచి కాయలు కొనుగోలు చేయనున్నాయి.

చిత్తూరులో ఇమామ్ ఉపదేశం



భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్‌ను శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.తక్బీర్ పఠిస్తూ ఊరేగింపుగా ఈద్గాలకు చేరుకున్నారు.బక్రీద్ ప్రాశస్త్యాన్ని ఇమామ్ వివరించాక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.పరస్పర ఆలింగనాలతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.అనంతరం పేదలకు దానధర్మాలు, ఖుర్బానీ పేరుతో పొట్టేలు మాంసాన్ని దానం చేశారు.

వడగాడ్పుల నడుమ వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా ఉదయం ఎండలు మండిపోతున్నాయి. వడగాడ్పులు, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు.జిల్లాలో 37 - 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ పరిస్థితుల్లోనే శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 14 మండలాల్లో ఓ మోస్తరు నుంచి బలమైన వర్షం కురిసింది. నగరిలో 30.2మిమీ, శ్రీరంగరాజపురంలో 30.2, పాలసముద్రంలో 25.2, నింద్రలో 24.4, ఐరాలలో 11.2, యాదమరిలో 10.4, గుడిపాలలో 9, కార్వేటినగరంలో 5.2, పుంగనూరులో 5.0, చిత్తూరులో 2, పెద్దపంజాణి, పూతలపట్టు మండలాల్లో 1.6, పెనుమూరులో 1.2, వి.కోటలో 1 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

చిత్తూరులో మోస్తరు వాన



చిత్తూరు కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి):చిత్తూరు నగరంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దాదాపు 40 నిమిషాలు పెద్దపెద్ద చినుకులతో కూడిన వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది.ఈదురు గాలులతో ఫ్లెక్సీలు చిరిగిపోయి కొట్టుకుపోయాయి.గిరింపేట,కొంగారెడ్డి పల్లె, గంగనపల్లె, జానకార పల్లెల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.చర్చి వీధి, పొన్నియమ్మ గుడి వీధి, బజారు వీధి, సీబీ రోడ్డు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీటితో మురిక్కాలువల నీరు కలిసిపోయి ప్రవహించడంతో పాదచారులు ముక్కులు మూసుకుని రాక పోకలు సాగించారు.

చెరువులకు చెర

రాజకీయ అండతో చెలరేగుతున్న రియల్టర్లు



బైరెడ్డిపల్లె చెరువులో మట్టి లోడేయుడంతో ఏర్పడిన గుంతల్లో చేరిన వర్షపునీళ్లు



గంగవరం మండలం మేలుమాయి సమీపంలో మట్టి తరలిస్తున్న టిప్పరు

పలమనేరు,జూన్7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నియోజకవర్గంలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో రాజకీయ నేతల కనుసన్నల్లో చెరువులను చెరపడుతోంది. ఈ మండలాల్లో దశాబ్దకాలంగా రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.పలమనేరు చల్లటి వాతావరణానికి పేరు పొందడంతో ఇక్కడ నివేశస్థలాలకు మంచి గిరాకీ వుంది.దీంతో పలమనేరుతో పాటు గంగవరం పంచాయితీ పరిధిలో ఉన్న భూములను రియల్టర్లు కొనుగోలు చేసి నివేశస్థలాలుగా మారుస్తున్నారు.రోడ్డుకు లోతట్టు భూముల ఎత్తు పెంచేందుకు టిప్పర్లతో మట్టిని తరలించి చదును చేస్తున్నారు. సాధారణంగా చెరువుల్లో మట్టిని తరలించాలంటే తప్పనిసరిగా సంబంధిత తహసీల్దార్ అనుమతితో పాటు మైన్స్ అధికారుల అనుమతి కూడా వుండాలి. అయితే వీరంతా ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకుంటుండడంతో అక్రమాలకు అడ్డుకట్ట వేసే వాళ్లే లేకుండా పోయారు.కాబట్టే రైతులకు కొంత మొత్తం అడ్వాన్సుగా చెల్లించి భూమిని స్వాధీనం చేసుకొని అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. బెంగళూరు -చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కూడా జరుగుతుండడంతో రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువుల్లో మట్టిని హైవే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా రోడ్డుపనులకు తరలించేశారు. దీంతో హైవే సమీపంలోని చెరువులు వాటి ఆయకట్టుకంటే గుంతగా మారిపోయాయి. దీంతో సాధారణ వర్షాలు కురిసినప్పటికీ చెరువుల్లో ఏర్పడిన భారీ గుంతలకే ఆ నీళ్లు పరిమితం అవుతుండటంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందే అవకాశం లేకుండా పోతోంది.ఒక్కోసారి మట్టితరలించడంతో ఏర్పడిన గుంతలు ప్రాణాలూ తీస్తున్నాయి. రెండురోజుల క్రితం వి.కోట మండలం మోట్లపల్లి సమీపంలోని చెరువు గుంతలో మునిగి ముగ్గురు పిల్లలు మృత్యువాత పడ్డారు.బాధిత కుటుంబాలను నేతలు పరామర్శించి ఓదార్పు మాటలు చెబుతున్నారు.అయితే మట్టి మాఫియా వల్ల చెరువుల్లో భారీగుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయనేది మాత్రం పట్టించుకోరు.

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ప్లాట్‌ఫాంపై డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

చిత్తూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల రవాణా అరికట్టడానికి చిత్తూరు రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో రైల్వే పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్లాట్‌ఫాం, బుకింగ్ ఆఫీస్, పార్శిల్ ఆఫీస్, వెయిటింగ్ హాల్‌లో ఈ తనిఖీలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి మాదక ద్రవ్యాలు దొరకలేదని చిత్తూరు రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. ఇకపై తనిఖీలు తరచూ జరుగుతాయని చెప్పారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి శనివారం నాలుగు గంటల సమయం పట్టింది. ఆలయం, పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచే వేలాదిగా తరలిరావడంతో క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా సిబ్బందితో కలిసి ఈవో పెంచలకిషోర్ తగిన చర్యలు తీసుకున్నారు.

రేపు 'షైనింగ్ స్టార్' అవార్డుల ప్రదానం

చిత్తూరు సెంట్రల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులను సోమవారం ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు డీఐఈవో శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక నాగయ్య కళా క్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్‌లో 190 మందికి, ఇంటర్మీడియట్‌లో 33 మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. ఒక్కో విద్యార్థికి ప్రశంసాపత్రంతోపాటు రూ.20వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు వివరించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 20వ స్థానం

చిత్తూరు సెంట్రల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా మండలి గత నెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం వెల్లడించింది. రాష్ట్రంలో చివరి స్థానంలోని చిత్తూరు జిల్లా ఈ ఫలితాలతో 20వ స్థానానికి చేరుకున్నట్లు డీవీఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్‌లో 41శాతం, సెకండియర్‌లో 58 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 20వ స్థానానికి చేరుకుందన్నారు. ఫస్టియర్‌లో 5294 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 2173 మంది పాసై 41 శాతం ఉత్తీర్ణత, సెండియర్‌లో 3521 మంది పరీక్షలు రాయగా, 2048 మంది విద్యార్థులు పాసై 58 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

81 శాతం రేషన్ పంపిణీతో తృతీయస్థానం



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ వేగం పుంజుకుంది. గత నెలాఖరు వరకు ఎండీయూ వాహనాల ద్వారా చేసిన పంపిణీ కంటే ఈనెల ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభించిన రేషన్ షాపుల ద్వారానే సరుకుల పంపిణీ మెరుగ్గా ఉంది. జిల్లా వ్యాప్తంగా 5,36,686 రేషన్‌కార్డులుండగా, శనివారం నాటికి 4,36,672 కార్డులకు, పోర్టబిలిటీ ద్వారా 81,893 కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. అంటే వారం వ్యవధిలోనే 81.36శాతం సరుకులు పంపిణీచేసి రాష్ట్రంలో చిత్తూరు జిల్లా తృతీయస్థానంలో నిలిచింది. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఉన్నాయి. రేషన్‌షాపులకు వెళ్లలేని దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు జిల్లాలో 50,457 మంది ఉండగా, శనివారానికి 39,103 (77శాతం) మందికి ఇండ్లవద్దకే సరుకులు తీసుకెళ్లి డీలర్లు అందించారు. ఎండీయూ వాహనాల వద్దకంటే రేషన్ షాపులే సౌలభ్యంగా ఉన్నాయని బియ్యం కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

73మంది ఎండీయూ ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 73మందికి మేనెల జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.ఆపరేటర్లకు ఒక్కొక్కరికి నెలకు రూ.18వేలను, వారి సహాయకులకు రూ.3వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది. మేనెలలో సరుకులు సక్రమంగా అందించని కారణంగా జీతాలను నిలిపివేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

'ప్లాట్‌ఫాం' కోసం డ్రైవర్లు, కండక్టర్ల గొడవ

- అరుపులు, కేకలతో దద్దరిల్లిన చిత్తూరు ఆర్టీసీ బస్టాండు




బస్టాండులో గొడవ పడుతున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి ప్లాట్‌ఫాం' కోసం చిత్తూరు వన్, టూ డిపోలకు చెందిన బస్సు డ్రైవర్లు, కండక్టర్ల మధ్య గొడవ చెలరేగింది. వీరి అరుపులు, కేకలతో చిత్తూరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం దద్దరిల్లింది. కొన్ని నెలలుగా రెండు డిపోల మధ్య బస్సులు తిరిగే రూట్ల విషయంలో వివాదాలున్నాయి. శనివారం జరిగిన ఈ గొడవతో అది బహిర్గతమైంది. కొన్ని రోజుల కిందట గంగాధరనెల్లూరు రూట్‌లో తిరుగుతున్న టూడిపో బస్సులను సడెన్‌గా తిరుపతి రూట్‌కు తిప్పడంతో వన్‌డిపోకు చెందిన ఉద్యోగులు టూడిపో అధికారులను ప్రశ్నించారు. ఆపై రాతపూర్వకంగా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. తామే తిరుపతి రూట్ తిప్పాలని వన్‌డిపో కార్మికులు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం రెండు డిపోలకు చెందిన బస్సులతో తిరుపతి ప్లాట్‌ఫాం వద్దకొచ్చారు. తమ బస్సులనే ముందు పెట్టాలని రెండు డిపోల ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. మరోవైపు రెండు డిపోలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు కూడా అక్కడికి చేరుకోవడంతో గొడవగా మారింది. ఈ గందరగోళంలో వన్ డిపో బస్సు వెనుకవైపున మరో బస్సు ఢీకొట్టడంతో కాస్త మరమ్మతుకు గురైంది. ఈ గొడవలన్నిటికీ టూడిపోకు చెందిన అధికారే కారణమని బహిరంగంగానే ఉద్యోగ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ఎవరు బస్సులు తిప్పినా ఆర్టీసీకేకదా లాభం వస్తుందన్న విషయాన్ని కూడా మరిచి ఇలా గొడవలు పడడం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

రేపు బోయకొండలో 2వేల మందితో యోగాంధ్ర

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలం బోయకొండ గంగమ్మ ఆలయ గాలిగోపురం సమీపంలో సోమవారం రెండువేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, వివిధశాఖల అధికారులు, ఆయుష్ నోడల్ అధికారులతో శనివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల్లో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇదివరకే కాణిపాకం, పులిగుండులో యోగాంధ్ర కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. సోమవారం బోయకొండ వద్ద ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పర్యాటకశాఖ అధికారులను ఆదేశించారు. పరిసర మండలస్థాయి అధికారులందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

బదిలీల వెబ్ ఆప్షన్‌లో గందరగోళం



ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన టీచర్లు

చిత్తూరు సెంట్రల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బదిలీల వెబ్ ఆప్షన్‌లో గందరగోళం నెలకొందని టీచర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పలువురు డీఈవో కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. బదిలీల్లో పాయింట్లు సాధించి అర్హత కలిగిన ప్రదేశాల్లో రాకుండా ఇష్టాను సారంగా దూర ప్రాంతాలకు బదిలీ కావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఈవో వరలక్ష్మిని కలవగా, రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు.



హనుమంత, గజ వాహనాలపై గోవిందుడు

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు శనివారం ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై గోవిందుడు తిరుమాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కరుణించారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3గంటలకు వసంతోత్సవం తర్వాత బంగారు తిరుచ్చిపై స్వామివారు మాడవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు గో, గోజ, అశ్వాలు వరుసక్రమంలో నడుస్తూ స్వామిపై భక్తిప్రపత్తులను చాటుకున్నాయి. కళాబృందాల ప్రదర్శనలు రంజింపచేశాయి. శనివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

స్వామి పిలుపుతోనే తిరుమలకు రాగలం

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): 'మనం అనుకున్నా.. స్వామి పిలిస్తేనే తిరుమలకు రాగలం' అని సినీ నటుడు రాజీవ్ కనకాల అన్నారు. తిరుమల శ్రీవారిని తన సహచరి సుమతో కలిసి శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'స్వామిని దర్శించుకున్న తర్వాత ఎంతో ఆనందంగా ఉంటుంది. అదొక అనిర్వచనీయ అనుభూతి' అని చెప్పారు. సుమ, రాజీవ్‌లతో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు. కాగా ఎంపీ బీకే పార్థసారథి, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



సుమ, రాజీవ్ కనకాల

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో బాటగంగమ్మ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,174

తలనీలాలు సమర్పించినవారు: 35,132





ఏపీ పీజీసెట్ వివరాలు వెల్లడిస్తున్న సెట్ ఛైర్మన్ సీహెచ్ అప్పారావు, కన్వీనర్ వీసీ వెంకటేశ్వర్లు

ఏపీ పీజీ సెట్‌కు సర్వం సిద్ధం

- 9, 10, 11, 12 తేదీల్లో పరీక్షలు
- ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష షెడ్యూల్ మార్పు
- 17 వర్సిటీల్లోని 25వేల సీట్ల భర్తీ

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ - 2025 నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు పీజీసెట్ ఛైర్మన్, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు చెప్పారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కన్వీనర్ వీసీ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ సురేంద్ర బాబు తదితరులతో కలిసి శనివారం వీసీ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ విద్యామండలి ఆధ్వర్యంలో పీజీసెట్‌ను ఎస్వీయూ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు సెట్ కన్వీనర్ వీసీ వెంకటేశ్వర్లు పూర్తి చేశారని పేర్కొన్నారు.

మూడు షిఫ్టుల్లో 30 కేంద్రాల్లో..

జూన్ 9, 10, 11, 12 తేదీల్లో రోజూ మూడు షిఫ్టులుగా పీజీ సెట్ జరగనుంది. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ సెషన్ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు జరుగనున్నాయి. మొదటి రోజున 17 సబ్జెక్టులకు, రెండో రోజు 7 సబ్జెక్టులకు, మూడవ రోజున 5 సబ్జెక్టులకు, నాల్గవ రోజున 2 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ తోపాటు మన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 30 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి.

మేలైన మార్పులు

విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది పీజీ సెట్‌లో కొన్ని మార్పులు చేశారు. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, లైఫ్ సైన్సెస్ సబ్జెక్ట్‌లను కలిపి ఒకే పరీక్షగా నిర్వహించనున్నారు. ఫలితంగా విద్యార్థులు ఒక్క పరీక్షతో ఏడు సబ్జెక్టుల్లో సీట్లు పొందే అవకాశం ఏర్పడింది. ఇలా ఇప్పుడు మొత్తం 31 సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగనున్నాయి.

తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో..

పీజీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు డిగ్రీలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్య అభ్యసించి ఉంటారు. అందువల్ల రెండు మాధ్యమాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రశ్న పత్రాన్ని ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో సిద్ధం చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషా సంబంధిత సబ్జెక్టులు మాత్రమే ఆయా మాధ్యమాల్లో ఉంటాయి.

తగ్గిన 6 వేల అప్లికేషన్లు

ఏపీలో మొత్తం 17 విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న 143 ప్రోగ్రామ్స్‌కు సంబంధించి సుమారు 25 వేల పీజీ సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకుగాను మొత్తం 25,688 మంది విద్యార్థులు ఏపీ పీజీసెట్-2025కు హాజరుకానున్నారు. అయితే గత ఏడాదితో పోల్చితే సెట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ దఫా సుమారు 6 వేల మంది తక్కువగా సెట్‌కు హాజరుకానున్నారు.

25వ తేదీలోపు ఫలితాలు

పీజీసెట్ ఫలితాలను ఈనెల 25వ తేదీలోపు ప్రకటిస్తామని ఛైర్మన్ చెప్పారు. ఫలితాలు విడుదల అయిన వెంటనే ప్రవేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గతంలో లాగానే ఈసారి కూడా కెమికల్ సైన్స్, లైఫ్‌సైన్స్, కంప్యూటర్‌సైన్స్, బోటనీ, జువాలజీ, మేథమేటిక్స్ వంటి సైన్స్ సబ్జెక్టుల్లో పోటీ ఎక్కువగా ఉందని, ఇంగ్లిష్, తెలుగు, హిస్టరీ, కామర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి సబ్జెక్టుల్లో ఒకమాదిరి పోటీ ఉందని వెల్లడించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయం మార్పు

ఏపీ పీజీ సెట్ షెడ్యూల్‌ను మార్చి 31వ తేదీన వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఐతే ఇటీవల ప్రకటించిన డీఎస్సీ షెడ్యూల్ కారణంగా పీజీసెట్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయంలో మార్పు చోటుచేసుకుంది. 9వ తేదీన పీజీసెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షతోపాటు డీఎస్సీ పరీక్ష కూడా ఉండటంతో రెండింటికీ హాజరుకానున్న అభ్యర్థులు వర్సిటీ అధికారులకు విన్నపాలు పంపారు. ఆ మేరకు జూన్ 9వ తేదీ ఉదయం నిర్వహించతలపెట్టిన ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షను 10వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించనున్నారు. ఇదితప్ప పీజీసెట్ షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులూ లేవని సెట్ ఛైర్మన్ వెల్లడించారు.

సూళ్లూరుపేట కమిషనర్‌పై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యపై శుక్రవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహేశ్వర్ కేసు నమోదు చేశారు. చిన్నయ్య తండ్రి ఉద్యోగంలో ఉండగానే.. ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు కూడా పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో విచారణ ప్రారంభిస్తామన్నారు.

పుష్కరిణిలో సబ్బులు, షాంపుల బంద్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణిలో పరిశుభ్రతను పరిరక్షించేందుకు టీటీడీ ప్రత్యేక సిబ్బందిని నియమించింది. అత్యంత పవిత్రమైన, పరిశుభ్రమైన శ్రీవారి పుష్కరిణిలో ఇటీవల పరిశుభ్రత లోపించిందని భక్తుల నుంచి టీటీడీకి వరుసగా ఫిర్యాదులు అందాయి. 'పరిశుభ్రతకు నీళ్లొదులుతున్నారు' శీర్షికన ఆంధ్రజ్యోతి ఇటీవల కథనం ప్రచురించింది. ఈక్రమంలో ఉన్నతాధికారులు శ్రీవారి పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా నలుగురు సిబ్బందిని నియమించారు. భక్తులు దుస్తులు ఉతకకుండా, సబ్బులు, షాంపులు వినియోగించకుండా వీరు పర్యవేక్షిస్తారు.



పుష్కరిణి వద్ద విధుల్లో సిబ్బంది

పెద్ద ప్రమాదం..భక్తులు క్షేమం



చెట్టును ఢీకొన్న కారు

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైన సందర్భంలో 19వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో నలుగురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అత్యాధునికంగా అలిపిరి చెక్‌పాయింట్

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్ పాయింట్‌ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. భక్తులు ఎక్కువ సమయం వేచిఉండకుండా వాహనాల తనిఖీ, భక్తుల లగేజి స్కానింగ్ జరిగేలా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులలో ఉన్న స్కానింగ్ వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. టోల్‌ప్లాజాలో తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదిక తయారు చేయాలన్నారు. సమీక్ష అనంతరం అలిపిరి చెక్‌పాయింట్‌లో స్కానర్లను పరిశీలించి అధికారులు, సిబ్బందితో ఈవో మాట్లాడారు.



భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల కేంద్రం తనిఖీ

ఇలాఉండగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళికృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులతో కలిసి భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల జారీని శనివారం సాయంత్రం ఈవో శ్యామలరావు పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. శ్రీవారిమెట్టుమార్గం ద్వారా వెళ్లే కాలినడక భక్తులకు రోజుకు సరాసరి 5 వేల టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. శ్రీవారిమెట్టుకు సమీపంలోని శ్రీనివాసమంగాపురంలో డీడీ టోకెన్ల జారీకి ఆర్కియాలజీ నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

కల్తీ నెయ్యి కేసులో ధర్మారెడ్డిని విచారించాలి

- జనసేన నేత కిరణ్‌రాయల్

తిరుపతి(జీవకోన), జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలకపాత్రధారి అయిన మాజీ ఇన్‌చార్జి ఈవో ధర్మారెడ్డిని అరెస్టు చేసి విచారించాలని జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఆయన ఎక్కడ ఉన్నారో తెలియదని, వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లడ్డూలో కల్తీ పెద్ద పాపమని, డబ్బు కోసం ఇది జరగలేదని, ఒక మతంపై దాడికోసమే చేశారని ఆరోపించారు.భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారికి శిక్ష సరిపోదని... ఉరి తీయాలన్నారు. నెయ్యి లేకుండా నాలుగేళ్ల పాటు లడ్డూలు అమ్మారని, ఈ విషయంలో ఒకరిద్దరు మీడియా సిబ్బంది కూడా సహకరించారన్నారు.టీటీడీలోని అన్ని విభాగాలకూ కీలకంగా వ్యవహరించిన ధర్మారెడ్డిని ఎవరు కాపాడుతున్నారనేది తేలాలన్నారు.అప్పటి పాలకమండలి సభ్యులకు కూడా ఇందులో భాగముందని వ్యాఖ్యానించారు.ఈ దొంగల ముఠాలో ప్రిన్సిపాల్ ఎవరంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ధర్మారెడ్డికి తెలియకుండా ట్యాంకులు పైకి ఎలా వెళతాయని ప్రశ్నించారు.కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా తప్పు చేసిన వారినే శిక్షించాలన్నారు. పర్చేజింగ్ కమిటీ మెంబర్లను కూడా విచారించాలన్నారు. ఈ అంశంపై చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.



శ్రీవారి లడ్డూ జీఐ హక్కుల ఉల్లంఘనపై సీరియస్

- పలు సంస్థలకు టీటీడీ నోటీసులు

తిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రీవారి లడ్డూప్రసాదం పేరును అనధికారికంగా వినియోగించుకుంటున్న కొన్ని సంస్థలపై టీటీడీ కొరడా ఝుళిపించింది. జీఐ(జియోగ్రాఫికల్ ఇండికేషన్) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డూ పేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న, ప్రచారం చేస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలకు పూనుకుంది. ఇప్పటికే కొన్ని సంస్థలకు గత నెల 31న నోటీసులు జారీ చేసింది. 2009లోనే తిరుమల శ్రీవారి లడ్డూకు జీఐ పేటెంట్ లభించిన సంగతి తెలిసిందే. అంతకుముందు పదేళ్ల క్రితం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ చట్టం ప్రకారం జీఐ హక్కులను సాధించింది. పేటెంట్ హక్కులు, జీఐ పొందిన ఏకైక దేవాలయ ప్రసాదంగా శ్రీవారి లడ్డూ అగ్రస్థానంలో నిలిచింది. ఆన్‌లైన్ ద్వారా, నేరుగా కొన్ని స్వీట్స్ విక్రయ సంస్థలు శ్రీవారి లడ్డూ పేరుతో విక్రయిస్తున్నట్టు టీటీడీ గుర్తించింది. ఈ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు టీటీడీ లా విభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా చాంబర్స్ ద్వారా పుష్ మై కార్ట్, ట్రాన్స్‌ఫ్ట్ ఫుడ్స్ లిమిటెడ్, ఇండియా స్వీట్ హౌస్ వంటి ఐదారు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. బయట విక్రయాలతో ఈ ప్రసాదానికి ఉన్న గౌరవాన్ని తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే పుష్ మై కార్ట్ తమ ఉత్పత్తుల జాబితా నుంచి లడ్డూ ప్రసాదం పేరును తొలగిస్తున్నట్టు ప్రకటించింది. మరికొన్ని కూడా తొలగించినట్టు తెలిసింది.

లడ్డూ ప్రసాదం స్వీట్ కాదు : ఈవో

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం. స్వీట్ కాదు. ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ఇది ప్రతీక టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. ఇలాంటి ప్రసాదం పేరును బయట సంస్థలు తప్పుగా వాడితే చర్యలకు వెనకడుగు వేయబోమన్నారు.

భక్తులకు శుభవార్త

- తిరుపతి టూ పూరి ఆర్టీసీ బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంతో పాటు ఒడిశా ప్రజలకు ఇది నిజంగా శుభవార్తే. పూరి జగన్నాథ స్వామి, తిరుమల శ్రీవారి ఆలయాలను సందర్శించాలనుకునే వారికోసం పూరి టూ తిరుపతికి ఒడిశా ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. తిరుపతి, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, బెర్హంపూర్ మీదుగా పూరి(భువనేశ్వర్)కి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇదే మార్గంలో నడుస్తాయి. ఇలా రెండు ప్రభుత్వాలు పరస్పర రహదారి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఏసీ స్లీపర్ 42 సీట్ల సామర్థ్యం, తాజా సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సదుపాయాలు, ఆకర్షణీయమైన రంగులతో తిరుపతి బస్టాండులో బస్సు సిద్ధంగా ఉంది. పురుషులకు రూ.2,750,స్త్రీలకు 50శాతంతో రూ.1,375గా టిక్కెట్ నిర్ణయించారు. ఈ విధానం ఉభయ రాష్ట్రాల ప్రజలకూ వర్తిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్సు బుకింగ్ చేసుకోవచ్చు.

బస్సు ప్రయాణించే రోజులు, వేళలిలా...

- ప్రతి శని, సోమవారాలు ఉదయం 9గంటలకు తిరుపతి బస్టాండు నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పూరికి చేరుకుంటాయి.
- ప్రతి బుధ, శుక్రవారాలు ఉదయం 9 గంటలకు పూరి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు తిరుపతికి చేరుకుంటాయి.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ - ఓపెన్ హౌస్ ఈవెంట్‌కు హాజరైన విద్యార్థులు





ఐఐటీలో ఓపెన్ హౌస్ ఈవెంట్

- ప్రత్యక్షంగా 60.. ఆన్‌లైన్‌లో 120మంది హాజరు

ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ ఈవెంట్ జరిగింది. ఈ అవగాహన సదస్సులో 60మంది విద్యార్థులు ప్రత్యక్షంగా, 120మంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. పరిశోధనలు, కన్సల్టెన్సీ, పరిశోధనలు-పరిశ్రమల సహకారానికి అవకాశాలు, కెరీర్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ అవకాశాలపై ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా జీవితంపై స్పష్టతను అందించడం ద్వారా విద్యార్థులు కెరీర్ అభివృద్ధిపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందని ఈ ఓపెన్ హౌస్ ద్వారా వివరించారు.

కారు డెకార్స్ యజమానిపై వైసీపీ శ్రేణుల దాడి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు డెకార్స్ యజమానిపై వైసీపీకి చెందిన ముగ్గురు యువకులు దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటన శనివారం తిరుపతి చింతలచేను వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మోహన్‌రావు చింతలచేను రోడ్డులో సీఎస్ఆర్‌కే పేరుతో కారు డెకార్స్ కంపెనీ నడుపుతున్నాడు. తిమ్మినాయుడుపాలెంకు చెందిన వైసీపీ నేత చైతన్యయాదవ్ భాగస్వామిగా ఉన్నాడు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. వివాదం ముదరడంతో కంపెనీ షోరూములో ఉన్న మోహన్‌రావుపై చైతన్య యాదవ్, అతని వర్గీయులు మూకుమ్మడిగా దాడి చేశారు. మోహన్‌రావుకు గాయాలయ్యాయి. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లింగేశ్వరనగర్‌లో ఫ్లెక్సీల రగడ

- వైసీపీ సర్పంచ్ అత్యుత్సాహంతో ఫ్లెక్సీలు, టెంట్ల ఏర్పాటు
- టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వనగర్‌లో సర్పంచ్ అత్యుత్సాహంతో చేసిన ఏర్పాట్లు ఉద్రిక్తతకు దారితీశాయి. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదానికి కారణమైంది. పోలీసుల కథనం మేరకు....లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటేశ్వరరావు(వైసీపీ) పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గ్రామంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. షామియానా, టెంట్లతో పాటు రోడ్డుకు అడ్డంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టారు. దాదాపు 10 ఇళ్ల చుట్టూ టెంట్లు వేసి రాకపోకలకు దారి లేకుండా చేయడంతో సర్పంచ్ ఇంటి పక్కనే ఉంటున్న హేమలత(టీడీపీ) నిరసించారు. ప్రజలకు అసౌకర్యం కల్పించారంటూ ప్రశ్నించారు. ఈ దశలో ఇరు పక్షాల మధ్య వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఆగ్రహోదగ్రులైన టీడీపీకి చెందిన కొందరు బ్యానర్లు, ఫ్లెక్సీలను చించేశారు. దీంతో వైసీపీ నాయకులు, సర్పంచ్ వర్గీయులు హేమలతతో పాటు అతని కుమారుడుపై చిట్టిరాయులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సీఐ చిన్నగోవిందు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ డౌన్...డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే సీఐ చిన్నగోవిందు టీడీపీ కార్యకర్తలాగా వ్యవహరించి బ్యానర్లు, ఫ్లెక్సీలు చించి వేశారంటూ వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆయన అనుచరులు విమర్శించారు. స్టేషనుకు వచ్చి సీఐ వ్యవహార శైలిపై డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారించి నివేదిక ఇవ్వాలని సీఐ సునీల్‌కుమార్‌ను డీఎస్పీ ఆదేశించారు.

వేడుకగా తెప్పోత్సవాలు ప్రారంభం

- 10న పద్మావతి అమ్మవారికి గజ వాహన సేవ

తిరుచానూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి పద్మసరోవరంలో విహరించి భక్తులను అభయమిచ్చారు. ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించాక మధ్యాహ్నం కేటీ మండపంలో శ్రీకృష్ణస్వామికి అభిషేకం జరిగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను పుష్కరిణిలోకి వేంచేసి తెప్పలపై కొలువుదీర్చారు. రాత్రి 7.15గంటలకు వేడుకగా తెప్పోత్సవం ప్రారంభమైంది. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఉభయదేవేరుల సమేత శ్రీకృష్ణసమేత మూడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. అనంతరం తిరుమాడ వీదుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి తెప్పలపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు అమ్మవారు తెప్పలపై భక్తులకు దర్శనభాగ్యం ఇవ్వనున్నారు. 10న అమ్మవారికి గజ వాహన సేవ, 11న గరుడ వాహన సేవ జరగనుంది. తెప్పోత్సవాల కారణంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇన్‌చార్జి ఏవీఎస్వో శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.




పుష్కరిణిలో తెప్పపై ఉభయదేవేరిలతో విహరిస్తున్న శ్రీకృష్ణస్వామి

ట్రంప్ విధానాలపై వ్యతిరేకత

- ఆందోళనలో అమెరికాలోని భారతీయులు
- ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ చలం

తిరుపతి, జూన్7(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధానాలతో ఇండియాతోపాటు పలు దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ.చలం అన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో 'ట్రంప్ విధానాలు భారతదేశంలో ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఉత్పత్తిరంగం దెబ్బతిని నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఆయుధ వ్యాపారిగా మారిందని విమర్శించారు. అయినా ప్రధాని మోదీ ట్రంప్‌కు దాసోహం అంటున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు కార్యకర్తలు ట్రంప్ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 'కాశ్మీర్ సమస్య-బీజేపీ వైఖరి' అనే అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఇటీవల పెహల్గం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలను మోదీ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలే కానీ అది యుద్ధంతో కాదని పేర్కొన్నారు. యుద్ధంతో సాధారణ పౌరులు చనిపోతారని అందుకే యుద్ధాన్ని వ్యతిరేకించామని వివరించారు. దీనిని బీజేపీ రాజకీయం చేసి సీపీఐపై అభాండాలు వేశారు.... అయితే ట్రంప్ యుద్ధాన్ని ఆపాలని చెప్పగానే ఆపివేశారని తెలియజేశారు. టెర్రరిస్టుల, మావోయిస్టుల అంతం కొనసాగుతుందని చెప్పడం కేవలం బీహార్‌లో ఎన్నికల లబ్ధి కోసమేనని విమర్శించారు. ఈ సదస్సుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షత వహించగా నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు.






మాట్లాడుతున్న చలం, నారాయణ

Morning WALK

నిమ్మపండు ఛాయ.. ముఖాన బిగి నగవు.. భారతీయ విద్యాభవన్ ప్రాంగణంలో ప్రతి ఉదయం చురుగ్గా నడుస్తూ కనిపించే 80 ఏళ్ల పెద్దాయన పేరు మురళి. విద్యావేత్త. ఎస్వీ యూనివర్శిటీ పూర్వ వైస్‌ఛాన్సలర్. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు మేనమామ. ఈ ఆర్భాటమేదీ ఆయన మాటల్లోనూ, ప్రవర్తనలోనూ కనిపించదు. రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో విశ్రాంత జీవితం గడుపుతున్నారాయన. విద్యారంగంలో అపార అనుభవం ఉన్న ప్రొఫెసర్ మురళితో ఆంధ్రజ్యోతి మార్నింగ్ వాక్ సంభాషణ..



ఎస్వీయూలో కామర్స్‌లో పీజీ పూర్తి చేసి 1969లో ఫ్యాకల్టీ మెంబర్‌గా జాయిన్ అయిన మురళి 1980లో 'ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ ఇన్ షుగర్ ఇండస్ట్రీ' అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణస్వామి నేతృత్వంలో పీహెచ్‌డీ చేశారు. ఎస్వీయూ కామర్స్ విభాగంలో తొలి డాక్టరేట్ పట్టా వీరిదే. తిరుపతిలో ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

అమ్మ మాటలే బాటగా...

"మా సొంతూరు కడప జిల్లా రాజంపేట. అక్కడే పుట్టి, పెరిగా. అప్పట్లో రాజంపేటలో హైస్కూల్ లేదు. ఊరి పెద్దల చొరవతో నా చిన్నపుడే రాజంపేటకు స్కూల్ మంజూరైంది. మా తాత తొలిచందా ఇచ్చి, ఇతర దాతల సహకారంతో బడి నిర్మాణం పూర్తి చేశారు. ఊళ్లోనే బడి ఉండడంతో నా చదువు ఆటంకం లేకుండా సాగింది. పీయూసీ కోసం 1961లో తిరుపతికి వచ్చి ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ (ప్రస్తుత ఓరియంటల్ కాలేజ్)లో చదువుకున్నా. మా అమ్మ నన్ను బాగా ప్రోత్సహించేది. 'చదువుకుంటేనే విలువ' అని పదేపదే చెప్పేది. అమ్మ మాటలే చదువుపై గురి పెంచాయి. ఉన్నత చదువులకు నడిపించాయి. మా అక్క ఆ రోజుల్లోనే ఎంఏ సంస్కృతం చేసింది. అప్పట్లో ఆడపిల్ల ఎంఏ అంటే అందరూ ఆశ్చర్యపోయేవారు.

నేను టీచర్...వెంకయ్య స్టూడెంట్

21 ఏళ్లకే కామర్స్‌లో పీజీ పూర్తిచేశా. 22ఏళ్ల వయస్సులోనే నెల్లూరు వీఆర్ కాలేజ్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు అక్కడ బీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. భారతీయ జన సంఘ్‌లో చురుగ్గా ఉండేవాడు. నా విద్యార్థి కాదుగానీ మా ఇద్దరి మధ్య ఒక బంధం ఉండేది. కలిసి మాట్లాడుకునేవాళ్లం. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా తరుచూ మాట్లాడేవారు. ఇటీవల తిరుపతిలో జరిగిన జమిలి ఎన్నికల అవగాహన సదస్సులో కూడా మేమిద్దరం ఒకే వేదిక పంచుకున్నాం.

వర్శిటీలు డొల్లగా మారుతున్నాయి!

● ప్రభుత్వాలు పట్టించుకోవాలి ● ఎస్వీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ మురళి



" సత్య నాదెళ్ల ప్రాథమిక విద్య వరకు మాకు దగ్గరగా ఉండేవాడు. చిన్నపుడు కూడా చాలా చురుకుగా ఉండేవాడు. ఇప్పటికీ అప్పుడప్పుడూ కుటుంబ విషయాల గురించి ఫోన్‌లో మాట్లాడుకుంటాం. ఒక్కోసారి సత్యా ఇండియాకు వచ్చే విషయం కూడా పత్రికల్లో చూసి తెలుసుకుంటూ ఉంటాం. అంత బిజీ."

వివాదాలన్నీ వీసీ ఛాంబర్ చుట్టూ

ప్రశ్నించేవారు లేకపోతే వ్యవస్థ పనిచేయదు. అలాగని విద్యాలయాల్లో విశృంఖలత్వం పనికిరాదు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాల ఆధిపత్యం కలవరపెడుతోంది. వామపక్ష పార్టీల విద్యార్థి సంఘాలు అప్పుడూ చురుకుగా ఉండేవి. వారి సిద్ధాంతాల ప్రకారం నడిచేవి. పాలనావ్యవహారం జోలికి వచ్చేవారు కాదు. వాళ్ల సమస్యలేమైనా ఉంటే ప్రిన్సిపల్ స్థాయిలో, హాస్టల్‌లో ఏదైనా ఉంటే వార్డన్ పరిధిలో జరిగిపోయేవి. ఇప్పుడన్నీ వీసీ ఛాంబర్ చుట్టూ జరుగుతున్నాయి. ఇది మంచి పరిణామం కాదు.

ఒకసారి ఏం జరిగిందంటే..

నేను వీసీగా ఉన్నప్పటి ఒక సందర్భం గురించి చెబుతాను.. ఒకరోజు రాత్రి హాస్టల్‌లో కరెంట్ లేదు. విద్యార్థులు ప్రిన్సిపల్‌నూ, వార్డన్‌నూ అడిగితే పై అధికారుల నిర్ణయమని తోసేశారు. ఆ అసహనంతో విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి చొరబడి పూలకుండీలు పగలగొట్టారు. కుర్చీలు విరగొట్టారు. నిజానికి జరిగింది ఏమిటంటే..సెలవులు ఇచ్చినా హాస్టల్ ఖాళీ చేయడంలేదన్న కారణంతో కరెంట్ తీసేశారు. అది కూడా ప్రిన్సిపల్, వార్డన్ పరిధిలో జరిగిన నిర్ణయం. కానీ రాజకీయ ప్రోద్బలంతో విద్యార్థులను తప్పుదారి పట్టించారు. ఇటువంటి వాతావరణం విశ్వవిద్యాలయాలను కలుషితం చేస్తున్నాయి.

వీసీగా దిగిపోయినా పార్ట్‌టైం ఫ్యాకల్టీగా..

2001 నవంబరు 7 నుంచి 2004 నవంబరు 6 దాకా ఎస్వీయూ వీసీగా పనిచేశా. వీసీగా బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత మళ్లీ విభాగాధిపతిగా చేశా. వీసీగా చేసి మళ్లీ విభాగాధిపతిగా ఎందుకు.. రిజైన్ చేసెయ్యమని కొందరు సలహా ఇచ్చారు. నేను మాత్రం నా విభాగంలో పనిచేసి రిటైర్ అయ్యా. పదవీ విరమణ చేసిన తర్వాత కొంతకాలం పార్ట్‌టైం ఫ్యాకల్టీగా కూడా పనిచేశా. భారతీయ విద్యాభవన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నా. మా అబ్బాయి అమెరికాలో స్థిరపడ్డాడు. అక్కడికి రెండేళ్లకోసారి వెళ్లి వస్తుంటాం. రోజూ ఉదయం 5 గంటలకే లేచి వ్యాయామం చేయడం, మితాహారం.. ఇవే నా ఆరోగ్య రహస్యాలు.

వర్సిటీలకు నిధుల కొరత

ప్రస్తుతం విశ్వవిద్యాలయాలను నిధుల కొరత వేధిస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీలు తప్ప స్టేట్ యూనివర్సిటీలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మన వర్సిటీలకు నిధులకు కొరత లేదు. విభజన తర్వాత నిధుల కష్టాలు మొదలయ్యాయి. దీన్ని అధిగమిస్తే తప్ప చదువులో నాణ్యత పెరగదు. ప్రభుత్వాలు పట్టించుకోవాలి. విశ్వవిద్యాలయాలు మంచి పౌరులను దేశానికి అందించగలవు. డొల్లగా మిగిలిపోతున్న యూనివర్శిటీలకు తిరిగి జవసత్వాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. అత్యంత ప్రాధాన్యాంశంగా దీనిని గుర్తించాలి.

ఆందోళనకర స్థితిలో ఎస్వీయూ

ఎస్వీయూకు క్రమంగా గ్రేడ్ తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ముఖ్యకారణం సిబ్బంది కొరత. కొన్ని విభాగాలైతే ఒకరిద్దరు ప్రొఫెసర్లతోనే నడుస్తున్నాయి. దీనివలన వర్సిటీ స్థాయి దిగజారిపోతుంది. నాణ్యమైన విద్య దూరమైపోతుండడంతో దూరవిద్య ద్వారా డిగ్రీలు తెచ్చుకుంటున్నారు. కంప్యూటర్ బేస్డ్ కోర్సులకు మాత్రమే విద్యార్థులు వర్సిటీలకు వెళుతున్నారు. పరిశోధనల సంఖ్య కనిపిస్తున్నా.. గైడ్‌ల కొరత ఉంది.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.2,00232 విరాళం





చంద్రన్, మల్లికార్జున్‌కు రసీదు అందజేస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణట్రస్టుకు విజయవాడకు చెందిన మల్లికార్జున, చిత్తూరు కొంగారెడ్డిపల్లెకు చెందిన చంద్రన్‌లు ఒక్కొక్కరు రూ.1,00,116 చొప్పున రూ.2,00232లను శనివారం వేర్వేరుగా విరాళమిచ్చారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లను చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలను పాటించండి

● మామిడికి గిట్టుబాటు ధర కల్పించడంపై అధికారులకు ఎంపీ దగ్గుమళ్ల సూచన



చిత్తూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో సీఎం నారా చంద్రబాబు ఆదేశాలను అధికారులు తప్పక పాటించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులకు నష్టం కలగకుండా తోతాపురి మామిడి టన్నుకు రూ.12వేలు ప్రకటించిన సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలోని గుజ్జు పరిశ్రమలు కూడా ఇక్కడి రైతుల వద్దే కాయలు కొనేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం కర్ణాటక, తమిళనాడు నుంచి మామిడి కాయలు జిల్లాకు దిగుమతి కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మామిడి రైతులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎంపీ ఆప్రకటనలో వివరించారు.

11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీకి బుద్ధి రాలేదు

తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి

చిత్తూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనను రాష్ట్ర ప్రజలు తిరస్కరించి.. కేవలం 11 సీట్లకు పరిమితం చేసినా వారికి బుద్ధి రాలేదని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం జగన్ రెడ్డి తన కిరాయి బ్యాచ్‌తో రాష్ట్ర రాజధాని అమరావతిని కించపరిచేవిధంగా మాట్లాడించడం తగదన్నారు. 2014లో అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఒప్పుకుని, 2019లో అక్కడే సొంతింటిని నిర్మించుకుంటానని, రాజధానిని మార్చే అవకాశం లేదని రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి, తీరా గెలిచాక మూడు రాజధానుల పేరుతో మోసం చేశారని వివరించారు. మహిళల జోలికి వచ్చినా, ఆడపిల్లలను అల్లరి చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా వారికదే చివరి రోజని సీఎం చంద్రబాబు పదే పదే హెచ్చరిస్తున్నారన్నారు. వైసీపీ నేతలు మహిళల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు మాన్యువల్‌గా నిర్వహించాలి

● నష్టపోయిన ఉపాధ్యాయులకు రీకౌన్సెలింగ్ జరపండి
● నేడు డీఈవో కార్యాలయ ముట్టడి ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక



మీడియాతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలను మాన్యువల్‌గా నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. వారి మాటల్లోనే.. 'మే 19, 20 తేదీల్లో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీల)కు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ జరిపి, బదిలీలు చేపట్టడానికి అంగీకరించడం జరిగింది. కానీ ఎస్జీటీలకు మళ్లీ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని చెప్పడం అంటే ఇచ్చిన హామీని ఉల్లంఘించడమవుతుంది. అంతేకాక ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఇప్పటివరకు జరిగిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తడంతో చాలామంది నష్టపోవడం జరిగింది. అటువంటి వారికి రీకౌన్సెలింగ్ జరపాలి. చాలా మంది రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, బదిలీల వెబ్‌సైట్లో తప్పనిసరి బదిలీగా చూపడంతో వారు బదిలీలకు ఆప్షన్ ఇచ్చుకోలేక పోయారు. తుది సీనియారిటీ జాబితాలు విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల వినతులు పరిష్కారం కాకుండానే ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలా మంది నష్టపోయారు. కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు కేటాయించారు. కొన్ని పాఠశాలల్లో ఒక పోస్టు ఖాళీగా ఉండగా సదరు పోస్టుకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయంచడంతో కొంతమంది నష్టపోయారు. బదిలీల ప్రక్రియలో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని కోరుతూ ఆదివారం డీఈవో కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తున్నాం. టీచర్లు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని ఐక్యవేదిక నాయకులు కోరారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఆర్ మదన్ మోహన్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, ఉపాధ్యాయ సంఘ నేతలు విజయభాస్కర్ రెడ్డి, ఎం.గోవిందస్వామి, జయకాంత్, నాగరాజ, నరేంద్రరెడ్డి, ఏకాంబరం, చంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

పేటూరులో జంట ఏనుగుల దాడులు



పేటూరు సమీపంలో ఒంటరి ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి చెట్టు

సోమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల గుంపు పొలాల్లో స్వైర విహారం చేస్తూ రైతులకు కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. శుక్రవారం రాత్రి జంట ఏనుగులు పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో ప్రవేశించి దేశయ్య, చిట్టి, ప్రసాద్, పెద్దఉప్పరపల్లెకు చెందిన ప్రకాశ్, సుబ్రహ్మణ్యం, రమేశ్, శంకరయ్య రైతుల టమోటా పొలాల్లో విచ్చలవిడిగా తిరగాడి మామిడి తోటల్లో కొమ్మలను, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించాయి. ఏనుగులు పేటూరు సమీపంలోని కరికల చెరువు వద్ద మకాం వేస్తున్నట్లు రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని నిరసన వ్యక్తం చేస్తున్నారు. నష్ట పరిహారం సైతం మంజూరు చేయడం లేదని వాపోతున్నారు.

జనసేన నేతపై వైసీపీ కార్యకర్త దాడి



గాయాలతో మణికంఠ

రామకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో జనసేన నేతపై వైసీపీ కార్యకర్త కత్తులతో దాడి చేసిన ఘటన గుడుపల్లె మండలంలో శనివారం జరిగింది. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. గుడుపల్లె మండల పరిధి కనమనపల్లె పంచాయితీ జనసేన అధ్యక్షుడు మణికంఠ (30) కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త తాండవకృష్ణ కుటుంబానికి మధ్య గత కొన్నేళ్లుగా భూవివాదం నడుస్తోంది. మణికంఠ కుటుంబానికి చెందిన భూమిని వైసీపీ ప్రభుత్వం ఉన్నపుడు తాండవకృష్ణ కుటుంబసభ్యులు ఆక్రమించుకున్నారు. మణికంఠ ఇటీవల ఈ విషయమై తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. ఇరుకుటుంబాలకు చెందిన వారు ఈనెల 10న తహసీల్దారు కార్యాలయానికి రావాలని ఆయన నోటీసులు పంపారు. రెండు రోజుల క్రితం తాండవకృష్ణ మణికంఠకు ఫోన్ చేసి చంపుతానని బెదిరించాడు. దీంతో మణికంఠ తాండవకృష్ణపై గుడుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మణికంఠ తన పిల్లలతో కలిసి పొలం వద్దకు వెళ్లగా కాపుగాసిన తాండవకృష్ణ కొంతమందితో కలిసి మణికంఠపై కత్తులతో దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ మణికంఠ అపస్మారక స్థితికి చేరుకోవడంతో అక్కడి నుంచి పారిపోయారు. అటుగా వచ్చిన స్థానికులు మణికంఠను గుర్తించి కుప్పం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై గుడుపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారి పేరుతో ప్రకృతి సంపదను దోచేస్తున్నారు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



కొండలను పరిశీలిస్తున్న నారాయణ

నగరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పేరుతో నగరి పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి (కొండలను, గుట్టలను) సంపదను దోచేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. నగరి పరిసర ప్రాంతాల్లోని కొండలను శనివారం సీపీఐ కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మేరకు పరిమితి ప్రకారం తీసుకోవాల్సిన ప్రకృతి సంపదను.. ఇష్టానుసారంగా తమిళనాడుకు తరలిస్తున్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం సిగ్గుచేటన్నారు. నెత్తంకండ్రిగలో అర్హులైన పేదలు 30 ఏళ్లుగా పక్కాగృహాలు నిర్మించుకుని నివాసముంటున్నారని, వారికి ఇంటి పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, మురళి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

ప్రసన్న వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వడమాలపేట,జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుంచి 8.00 గంటల నడుమ మిథున లగ్నం లో వైఖానస ఆగమోక్తంగా కంకణ భట్టాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మాడవీధుల్లో తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి ధ్వజస్తంభం ఎగుర వేశారు. ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణం నిర్వహించారు.అనంతరం ఉభయనాంచారులతో శ్రీవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ అనంతరం పెద్ద శేషవాహనం పై దేవేరుల సమా శ్రీనివాసుడిని అధిరోహింప జేసి సంపుర్ణ అలంకరణతో మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణభట్టార్ తిపయ్యఆచార్యులు, ఆలయ అధికారి శివ కుమార్ పాల్గొన్నారు.

వాహనాల బహూకరణ

తిరుపతికి చెందిన మాధవరావు రూ.6.50 లక్షలతో సూర్య, చంద్రప్రభ వాహనాలను, రైల్వే కోడూరుకు చెందిన మురళి రూ.5 లక్షలతో గజవాహనాలను అధికారులకు అందజేశారు. దాతలకు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయా వాహన సేవ రోజుల్లో దాతలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు అధికారులు చెప్పారు.



పెద్దశేష వాహనంపై దేవేరులతో శ్రీవారు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పై టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి సంతాపం తెలిపారు. ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, మాజీ సర్పంచ్ మహాదేవివిజయశంకర్ స్థానిక నేతలతో కలిసి వెంకటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు వారు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పంచాయితీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శంకర్‌చలం, నేతలు మహేంద్రనాయుడు, మణేష్, రామలింగం, గోపాల్‌రెడ్డి, మణి, వెంకటాచలం పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల తనిఖీలు



కుప్పం స్టేషన్‌లో ఆగిన రైలులో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

కుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం రైల్వే స్టేషన్‌లో శనివారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గంజాయి, రేషన్ బియ్యం తదితరాలు అక్రమంగా రవాణాపై తనిఖీలు చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాక కోసం వేచిఉన్న ప్రయాణికులు, రైళ్లలో ప్రయాణిస్తున్న ప్రయాణికుల వద్దకు వెళ్లి వారి బ్యాగులు, ఇతర వస్తువులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైల్వే హెడ్ కానిస్టేబుల్ రమేశ్ పాల్గొన్నారు.

9న యోగాంధ్రను విజయవంతం చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న డీటీవో గౌరి తదితరులు

చౌడేపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బోయకొండలో ఈనెల 9న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా టూరిజం అధికారి గౌరి, తహసీల్దార్ హనుమంతు కోరారు. శుక్రవారం బోయకొండలో యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణ స్థలాన్ని వారితోపాటు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయకొండ గోశాల సమీపంలో 2 వేల మందితో యోగాంధ్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు, యువత తదితరులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, ఎస్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

చౌడేపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీరుసాహేల్ పేర్కొన్నారు. శనివారం దుర్గసముద్రం పంచాయతీలోని రైతు సేవాకేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో జ్యోతమ్మ మాట్లాడుతూ వేరుశనగ సాగులో రైతులు విత్తన శుద్ధి, విత్తన మోతాదు, కలుపు నివారణ, యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, పొటాష్, జిప్సం ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. అలాగే టమోటా పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త మంజుల, వీఏఏ నవీన్, టీడీపీ నాయకులు రమణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.


23న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి

పలమనేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలమనేరు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రత్నారెడ్డి కోరారు. శనివారం పెన్షనర్ల సంఘ సమావేశంలో రత్నారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ పెన్షన్ రూల్స్‌కు తెచ్చిన సవరణలను నిరసిస్తూ ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ వారితో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యదర్శి దొరస్వామి మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ తేదీని 2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2026 మార్చి 31 వరకు ప్రభుత్వం పొడిగించిందని పేర్కొన్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్యశాలల్లోనూ వైద్యం పొంది మెడికల్ రీయింబర్స్‌మెంట్ పొందవచ్చని తెలిపారు. సంఘ ఉపాధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, సంఘ నాయకులు వెంకటరామప్ప, వెంకటేశ్వర్లు, నాగభూషణం, రాజన్న, కస్తూరి, కోటేశ్వరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి దంపతుల విహారం



పురవీధుల్లో ఊరేగుతున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

సోమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సోమల బంగారుతిరుత్తణి కొండపై నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ గోపుర ఆవిష్కరణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శనివారం స్వామివార్ల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఈక్రమంలోనే ఆలయంలోని మూలవిగ్రహాలకు అభిషేక పూజలు, హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక వినాయకస్వామి, అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త మేల్నాటి పద్మావతమ్మ, రెడ్డిజనార్దన్, పూల మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సోమలలో బలిబండి ప్రదర్శన



పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న వెంకటపతి

సోమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం భారతం మిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా శనివారం పంచ పాండవుల మూల విగ్రహాలకు అభిషేక పూజలు నిర్వహించారు. బలిబండి ప్రదర్శన కార్యక్రమంతో సోమల, దాసరివారిపల్లె, గన్నావారిపల్లె, పాయలవారిపల్లె, రాశెట్టివారిపల్లె, దిడ్డివారిపల్లె, రాజీవ్ నగర్ కాలనీల్లో భీమసేన వేషధారి అన్నసేకరణ ఆకట్టుకుంది. భక్తులు నగదు కానుకలు, తినుబండారాలు అందజేశారు. ఉభయదారులు వేముల మునిరాజు, రామ్మూర్తి కుటుంబ సభ్యులు భక్తులకు తీర్థప్రాదాలు పంపిణీ చేశారు.

మొట్లపల్లెలో బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం వి.కోట మండలం మొట్లపల్లె చెరువులో ఈతకెళ్లి ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన ఘటనపై పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బాధితులను పరామర్శించారు. శనివారం స్థానిక టీడీపీ నేతలతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయన రెడ్డెప్ప, ఆదెప్ప, కవిత కుటుంబాలను నేరుగా కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా కుశల్ తండ్రి రెడ్డెప్ప చెరువులోని ఓ ప్రాంతంలో లోతుగా మట్టి తోడేయడంతో గుంత ఏర్పడి ప్రమాదానికి కారణమైందని ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్, ధీరజ్, శబరీష్, మునస్వామిరెడ్డి, రాజారెడ్డి, సుబ్బన్న, మూర్తి, శివ పాల్గొన్నారు.

రైతులకు రాయితీ విత్తనాలు

బైరెడ్డిపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూరు నత్తం గ్రామంలో శనివారం ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

బైరెడ్డిపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో నూతనంగా పునః నిర్మించిన మహాగణపతి ఆలయంలో శనివారం సాయంత్రం గణపతిహోమం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయ సంఘాల నిరసన



ఎమ్మార్సీ ఎదుట నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ వద్దని, మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్‌తో బదిలీ చేయడానికి ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శంకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యంరెడ్డి, జగన్నాధంరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-మదనపల్లె మార్గంలో రోడ్డుపై నిలిపిన లారీని శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. మండలంలోని సుగాలిమిట్ట పంచాయతీ పెద్దతాండాకు చెందిన తిప్పానాయక్ కుమారుడు రెడ్డెప్పనాయక్ (50) ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొని గాయపడ్డాడు. పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి...

చౌడేపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని శెట్టిపేటకు చెందిన నాగేశ్వరరావు తన సొంత పనులు నిమిత్తం చౌడేపల్లెకు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యాడు. పెద్దపంజాణి మండలం గౌదమాకులపల్లెకు చెందిన రెడ్డిబాల తన ద్విచక్రవాహనంలో చౌడేపల్లె నుంచి పలమనేరుకు వెళుతూ ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను దాటే ప్రయత్నంలో నాగేశ్వరరావు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో నాగేశ్వరరావు, రెడ్డిబాల తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్సలు అందించారు. రెడ్డిబాల పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తిరుపతి కి తరలించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట విషాదం



అమూల్యరెడ్డి (ఫైల్ ఫొటో)

సదుం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు దివంగత వారణాశి రామస్వామిరెడ్డి పెద్ద కోడలు అమూల్యరెడ్డి (78) అనారోగ్యంతో చెన్నైలోని స్వగృహంలో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆమె మృతి పట్ల సదుం మండల ప్రజలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పడకేసిన పారిశుధ్యం..!

● వ్యాధుల బారిన ప్రజలు ● పట్టించుకోని అధికారులు



బైరేమంగళంలో వీధులపై ప్రవహిస్తున్న మురుగునీరు



నాకిరేపల్లెలో కాలువలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి

పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మాగాండ్లపల్లె పంచాయతీ బైరేమంగళం, నాకిరేపల్లె గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్యంపై అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో మురుగు కాల్వల్లోని వ్యర్థపునీరు వీధులో ప్రవహించడం, మురుగునీటిలోనే తాగునీటి కొళాయిలు ఉండటంతో నీరు కలుషితమవుతోంది. గ్రామాల్లో చిన్నపాటి వర్షం కురిసినా వీధుల్లో మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు తిరిగే పరిస్థితులు ఉండవని వాపోతున్నారు. గ్రామాల్లో మురుగునీరు ప్రవహించే కాల్వల్లోనే తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయడంతో ఎక్కడ తాగునీరు కలుషితమవుతాయనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కలుషితమైతే అంటురోగాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో వీధులపై ప్రవహిస్తున్న వర్షపునీరు, ఇళ్లలోని వ్యర్థపునీరు కలవడంతో అందులో నుంచి వస్తున్న దుర్వాసనతో దోమలు పెరిగి జ్వరాలు సోకుతున్నట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను తొలగించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను తొలగించి, వీధుల్లో మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు







పుంగనూరులో ముస్లింల ర్యాలీ, పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసిన ముస్లింలు, రొంపిచెర్లలో శుభాకాంక్షలు తెలుపుతున్న చల్లా

రామకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామకుప్పం పట్టణంలో ఉదయం 8 గంటలకు ముస్లింలు స్థానిక జామీయా, మక్కా, మదీనా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక ఈద్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ వారు సామూహిక ప్రార్థనలు చేశారు. ఇమామ్ బక్రీద్ పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం పరస్పర ఆలింగనాలతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే మండల పరిధి కొంగనపల్లె, చెల్దిగానిపల్లె, రాజుపేట, గెర్నిపల్లె, వర్తికుప్పం, లింగాపురం, గొరివిమాకులపల్లె, 89పెద్దూరు, బల్ల, గోవిందపల్లె, విజలాపురం, సింగసముద్రం, కెంచనబల్ల తదితర గ్రామాల్లో కూడా ముస్లిం బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **చౌడేపల్లె:** చౌడేపల్లెలో బక్రీద్ వేడుకలను స్థానిక ముస్లిం సోదరులు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని మేదరదొడ్డి, చౌడేపల్లె, కోటూరు, దాదేపల్లె, కాన్‌సాబ్ మిట్ట, లద్దిగం, పెద్దూరు, గోసలకురప్పల్లె తదితర గ్రామాల్లోని ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు చేశారు.

● **సోమల :** సోమల మండలంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గాల వద్దకు ప్రదర్శనగా వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. సోమల, నంజంపేట, ఇరికిపెంట, కందూరు, పెద్దఉప్పరపల్లె, నవాబ్‌పేట, నెల్లిమంద తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రార్థనలు జరిగాయి.

● **పలమనేరు:** త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని.. సాటి వారి కష్టాలను సామాజికంగా పంచుకోవడమే పండుగ ఉద్దేశమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులో బక్రీద్ పండుగను మైనారిటీ సోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మైనారిటీ టీడీపీ నాయకులు ఖాజాపీర్, చాంద్‌బాషా, అమానుల్లా, మాబాషా, ఇక్బాల్, షకీల్, మౌలా, నదీమ్, బాబాజాన్, అస్లాం పాల్గొన్నారు.

● పలమనేరులో శనివారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఎద్దుల సంత వీధిలోని ఈద్గాతో పాటు నాగమంగళం, పాతపేటలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు.

● **వి.కోట:** బక్రీద్ పండుగను వి.కోట మండలంలో ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పత్రపల్లె, ధన్నుపురం, ముదరందొడ్డి, కొంగాటం, నడిపేపల్లె గ్రామాల్లో ఈద్గాల ప్రార్థనలు చేపట్టారు.

● **పుంగనూరు:** బక్రీద్ వేడుకలను శనివారం పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మణవీధి, బైపాస్ రోడ్డు మీదుగా ఎన్ఎస్‌పేట, బసవరాజ ప్రభుత్వ కళాశాల వరకు ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు చేశారు. సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు లోకేశ్, రమణ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **సదుం:** త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను శనివారం సదుం మండలంలోని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పూర్వీకుల పేరిట పేదలకు దానాలు చేశారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల ఈద్గా వద్ద పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో పాటు టీడీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, పలువురు ముస్లింలు ఉదయాన్నే ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లె మండలంలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలకు పలువురు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



వి.రిషిత,



భరత్‌కుమార్‌నాయుడు

రొంపిచెర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్ అవార్డుకు రొంపిచెర్ల మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాసులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. పదో తరగతిలో మోడల్ స్కూల్ విద్యార్థులు రిషిత (586), భరత్‌కుమార్ నాయుడు (578), మీనావాణి (556), రొంపిచెర్ల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జోయా (565), కేజీబీవీ విద్యార్థిని ఎం.లలిత (536) మార్కులు సాధించడంతో ఎంపికయ్యారు. వీరికి ఈనెల 9న చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో రూ.20 వేలు నగదు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు.



ఇర్షాద్



కుష్బిహాజ్



సబిహ ఫిర్దోస్



మసత్

● **కల్లూరు:** పులిచెర్ల మండలంలో షైనింగ్ స్టార్ అవార్డుకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల ఎంఈవో కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇర్షాద్, మసత్, కుష్బిహాజ్, సబిహ ఫిర్దోస్ ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు సదుం విద్యార్థుల ఎంపిక

సదుం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆర్.రుచిత, ఎస్.అజ్వా తస్లీమ్, సి.రెడ్డి లక్ష్మి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ఎంట్రన్స్ టెస్టులో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

కూలిన కళాశాల ప్రహరీ



పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి వద్ద ఉన్న బసవరాజ ప్రభుత్వ కళాశాల ప్రహరీ ఒక్కసారిగా కుప్పకూలింది. కళాశాలలో ప్రహరీ పురాతన కాలంలో నిర్మించడంతో ఇటీవల కురిసిన వర్షానికి కుప్పకూలింది. త్వరలో కళాశాల ప్రారంభం కానుండటంతో ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భూసమస్యపై ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని మంగళం గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు అదే గ్రామానికి చెందిన చంద్రప్పలకు భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకటేశ్ భార్య శాంతమ్మపై చంద్రప్ప, సరోజమ్మ, శిల్ప దాడి చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కామాక్షమ్మ అడ్డు వెళ్లడంతో ఆమెపై దాడి చేసి గాయపరిచారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగాలి

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



మహిళా సభ్యులకు చెక్కును అందిస్తున్న అమరనాథరెడ్డి, శ్రీనివాసులు

వి.కోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకుని ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం వి.కోటలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన అమ్మాయాక్ట్స్ సంస్థ 28వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని విశ్వసించిన సీఎం చంద్రబాబు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించారన్నారు. మారుమూల గ్రామంలో చిరుసంస్థగా నెలకొల్పబడి సీఈవో దశరథరెడ్డి శ్రమతో సంస్థను 28 ఏళ్లపాటు 25 వేల కుటుంబాలను సభ్యులుగా చేర్చి విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కరోనా లాంటి సమయాల్లో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ ఏడాది సంస్థ ద్వారా వచ్చిన లాభాల్లో రూ.29 లక్షల డివిడెంట్‌ను తమ సభ్యులకు చెక్కు రూపంలో అందించారు. అలాగే సంస్థ ద్వారా రుణాలు పొందిన సభ్యుల పిల్లలు విద్యలో ప్రతిభ ఆధారంగా 331 మంది విద్యార్థులకు రూ.14 లక్షలు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 7 మందికి బంగారు పతకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో దశరథరెడ్డి, చైర్‌పర్సన్ మహిళా కుమారి, ఎంపీడీవో ఈశ్వరన్, ఎంఈవో చంద్రశేఖర్, సీఐ సోమశేఖర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు రంగనాథ్, నేతలు రాంబాబు, ఈశ్వర్, ధీరజ్, శబరీష్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో
ప్రైవేటు కళాశాలల ప్రతిభ

చిత్తూరు సెంట్రల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. అత్యధిక మార్కులు సాధించారని నిర్వాహకులు తెలిపారు.

పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాలలో..


కె.తేజ - పి.సాహితి

తమ విద్యార్థులు స్టేట్ టాపర్లుగా నిలిచారని పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు కె.ప్రజ్వల, పి.నక్షత్రలు 468 మార్కులతో స్టేట్ టాపర్లుగా నిలిచారన్నారు. జుషిత్ రాజ్, లక్ష్మీప్రసన్న, నలినిలకు 466 మార్కులు వచ్చాయి. బైపీసీలో 440 మార్కులకు పూర్ణిమి, శ్రీనిధి, రూపలు 425 మార్కులు సాధించినట్లు చెప్పారు. కామెడ్-కే లోనూ ఆలిండియా స్థాయిలో కె.తేజ 585, పి.సాహితి 3059, యోహిత్ సాయి 3325, గణేష్ 3730, వినిత్ 3735 ర్యాంకులు సాధించారన్నారు.

విజయం జూనియర్ కళాశాలలో..


రాజశ్రీ - జ్యోత్స్న - భవ్యశ్రీ

విజయం జూనియర్ కళాశాలలోని తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ఫస్టియర్ ఫలితాల్లో ఎంపీసీలో.. 470 మార్కులకు ఎన్.రాజశ్రీ, కె.పవన్‌కుమార్, టి.ప్రణీతలు 466 మార్కులు, పి.వేణి, ఎం.ధనవి, ఎన్.విష్ణుప్రియ, నాగవర్షితలు 465 మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీలో.. టి.జ్యోత్స్న (429/440), ఎంఈసీలో.. ఎం.డింపుల్ భవ్యశ్రీ (492/500), సీఈసీలో.. సోమంత్ కుమార్ (484/500) మార్కులు సాధించగా, 80మంది విద్యార్థులకు 450 మార్కులకంటే అధికంగా, 210 మందికి 400 మార్కుల కంటే అధికంగా వచ్చాయన్నారు. విద్యార్థులను విజయం అకడమిక్ ఈడీ శైలజామూర్తి, ప్రిన్సిపాల్ జీవనరత్నం, అధ్యాపకులతో కలిసి అభినందించారు.

అరుణాచల జూనియర్ కళాశాలలో..

తమ విద్యార్థులు సత్తా చాటినట్లు అరుణాచల జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి తెలిపారు. ఎంపీసీలో 470 మార్కులకు పి.తనూజ 452, ఎం.భవ్య 449, హేమచంద్ర 405, సైదియా 404, బైపీసీలో 440 మార్కులకు రేవంత్ 413, జగదీష్ 412, సీఈసీలో 500 మార్కులకు వెంకటాద్రి 450, హర్షిత 414 మార్కులు సాధించారన్నారు. ఫస్టియర్‌లో 76శాతం, సెకండియర్‌లో 82శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ వద్దు

- ఉపాధ్యాయ సంఘాల నిరసన


కార్వేటినగరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

వెదురుకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ వద్దంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం సాయంత్రం కార్వేటినగరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపుతో కార్వేటినగరం మండల ఉపాధ్యాయ సంఘాలు నిరసనకు దిగాయి. ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని జిల్లా నాయకులు నాగేంద్రరాజు, సర్దార్ కోరారు. మండల నాయకులు గురవయ్య, శివాజీ, జగదీషన్, రఘురామకృష్ణ, వేణు, లక్ష్మీపతి, సునీత, వాసు, మనోజ్, గంగాధరం, హరిబాబు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు మాజీ సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై దుష్ప్రచారం చేయడం, బీసీ, ఎస్సీలను అవమానించడం తదితరాలకు జగన్ క్షమాపణ చెప్పాలన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బీజేపీ


సమావేశంలో ప్రసంగిస్తున్న శివ

చిత్తూరు సెంట్రల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఐటీ ఇన్‌చార్జి ఎం.శివ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన కార్యశాల కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో శివ మాట్లాడుతూ.. 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నాయకులు విజయ్, మణిశర్మ, ప్రభాకర్, చంద్రమోహన్, రాజేంద్రన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి పట్టువస్త్రాల సమర్పణ


గ్రామస్తులతో కలిసి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కమ్మగుట్టపల్లె గ్రామ సమీపాన ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం జరిగిన పూజలకు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గ్రామస్తులు, వేదపండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, జిల్లా అధికారప్రతినిధి గంగారపు గోపి, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ జయబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరదుడి ఊంజల్ సేవ

- యాదమరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


పవళింపుసేవలో వరదరాజస్వామి

యాదమరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామికి 12 రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు శనివారం ఊంజల్ సేవ, వడాయితోత్సవంతో ముగిశాయి. ఉత్సవాల్లో అలసిన స్వామివారు సాయంత్రం ఊయలలో సేదతీరారు. అనంతరం వడాయితోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ, వాహన బేరర్లు, వేదపండితులను ఈ సందర్భంగా సత్కరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు నగరిలో ముద్దుకృష్ణమ విగ్రహావిష్కరణ

నగరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గాలి ముద్దుకృష్ణమ నాయుడు జయంతిని పురస్కరించుకుని సోమవారం నగరి టవర్‌క్లాక్ వద్ద ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ముద్దుకృష్ణమ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


గిరింపేట ఈద్గా మైదానంలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్, నాయకులు, చిన్నారులు, ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్


పాలేరు ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

చిత్తూరు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గిరింపేట ఈద్గా మైదానంలో ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి జునైది ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ప్రార్థనలకు ఎమ్మెల్యే జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. ఈద్గా మైదానంలో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగం, సహనానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని వారు చెప్పారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో అజా ఖనాయే జహారాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి ఈద్గా మైదానం వరకు ర్యాలీగా వచ్చారు. అక్కడ బక్రీద్ ప్రత్యేకతను మతగురువు నబీల్‌రిజా మౌలానా వివరించారు. గంగాధరనెల్లూరు అబ్బాస్‌కాలనీ, ఆవలాపురం ముస్లిం కాలనీ, బాలగంగనపల్లె గ్రామాల్లోనూ పండుగను జరుపుకున్నారు. అంజుమన్ అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు, తూగుండ్రం మాజీ సర్పంచ్ ఎస్.హెచ్.నియాజ్‌అలీ, వైస్ ప్రెసిడెంట్ ఇక్బాల్, కార్యదర్శి రహమత్, ట్రెజరర్ షాకీర్ అలీ, జాఫర్ అలీ, జె.బాబు బాషా, అలీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పాలేరు వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పూతలపట్టు: మండలకేంద్రంలో ముస్లింలు బక్రీద్‌ను జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెనుమూరు: మండల కేంద్రంలో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. నురాని వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాబాషా, ఆరీఫ్, మున్నా, షబ్బీర్, రఫీ, అజాద్ తదితరులు పాల్గొన్నారు.


కార్వేటినగరం, పెనుమూరుతోపాటు ఆవలకొండలోని ఈద్గా మైదానంలో జరిగిన ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

జీడీనెల్లూరు టీడీపీ పదవుల నియామకంపై ఉత్కంఠ

వెదురుకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవులపై గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పోటీ విపరీతంగా పెరిగింది. పార్టీ నాయకుల అభిప్రాయం మేరకే అధ్యక్ష పదవులను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ప్రకటిస్తున్నారు. అయితే తీవ్ర పోటీ థామస్‌కి తలనొప్పిగా మారింది. కమిటీల ఏర్పాటులో కాస్త ఆలస్యం జరిగింది. ఆశావహులకు సర్దిచెప్పి మండలానికి ఒకరితో ఏకగ్రీవం చేయాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. లేని పక్షంలో మండలానికి ఇద్దరి పేర్లతో అధిష్ఠానానికి నివేదిక పంపాలని చూస్తున్నట్లు తెలిసింది.

ఆశావహులిలా..

వెదురుకుప్పం మండల అధ్యక్ష పదవికి గురుసాల కిషన్ చంద్, పి.మోహన్‌మురళి, కె.చెంగ్రాయరెడ్డి, చాణిక్యప్రతాప్ పోటీ పడుతున్నారు. పెనుమూరు మండలంలో రుద్రయ్యనాయుడు, సతీష్ రెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, కృష్ణమూర్తినాయుడు ప్రయత్నిస్తున్నారు. కార్వేటినగరం మండలం నుంచి చెంగ్రాయయాదవ్, మేళం రవియాదవ్, తోటి రవికుమార్, వి.రాజా, సోమశేఖర్‌యాదవ్ ప్రయత్నిస్తున్నారు. గంగాధరనెల్లూరు మండలం నుంచి స్వామిదాస్, దేవసుందరం, చిట్టిరెడ్డి పావులు కదుపుతున్నారు. పాలసముద్రం మండలం నుంచి రాజేంద్రన్, వాసునాయుడు, శివయ్యనాయుడు మండల అధ్యక్ష పదవులను ఆశిస్తున్నారు. ఎస్ఆర్‌పురం మండలం నుంచి గంధమనేని జయశంకర్‌నాయుడు, గంధమనేని రాజశేఖర్‌నాయుడు, వేమనాయుడు, మురళి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవులు ఎవరిని వరిస్తాయో అన్న ఉత్కంఠ నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లోనూ నెలకొంది.

రేపు విజయపురంలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ


పనులను పరిశీలిస్తున్న చినబాబు తదితరులు

విజయపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పనులను శనివారం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు పరిశీలించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు దశరథరాజు, మునిభాస్కర్ రాజు, లోకేష్‌రాజు, హరికృష్ణా, బాలాజీనాయుడు, కపిల్, గాలి రమేష్, శివలింగం, మధు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన


ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

యాదమరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వికసిత్ సంకల్ప అభియాన్ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో సాగుపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. శనివారం కాశిరాళ్ల రైతు సేవాకేంద్రంలో తిరుపతి, కలికిరి కేవీకే శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు మంజుల, సంధ్య, నవీన్, ఏవో చరిత, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వసంతాపురం ఆర్ఎస్కేలో సమావేశం

గుడిపాల: మండలంలోని వసంతాపురం ఆర్ఎస్కేలో ఆదివారం ఉదయం 10 గంటలకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో సాగుపై సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు వ్యవసాయ అధికారి మాధవి శనివారం తెలిపారు.

మామిడి రైతుకు ప్రభుత్వ చేయూతపై హర్షం

గుడిపాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తోతాపురి టన్నుకు రూ.4వేలు అందించడంపై టీడీపీ మండల నాయకులు వాసుదేవరెడ్డి, దొరబాబు, ధనసింగ్, సురేష్, జయచంద్ర తదితరులు హర్షం వ్యక్తం చేశారు. గుజ్జు పరిశ్రమల యజమాన్యాలు కూడా రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బంగారుపాళ్యం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బాలికను ఓ యువకుడు కొంతకాలంగా ప్రేమించాలని వేధించేవాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో శనివారం ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో తుంబపాళ్యం గ్రామానికి చెందిన వడ్డే దేగయ్య(29)పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వండి

గుడిపాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రామ్మోహన్ కోరారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సెల్‌ఫోన్ల చోరీకి యత్నం

- దొంగలను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



చిత్తూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో శనివారం రెండు సెల్‌ఫోన్ల చోరీకి యత్నించిన దొంగలు రోగుల బంధువులకు చిక్కారు. వారా దొంగలకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. మెడిసిన్ వార్డులో ఓ మహిళా రోగి తన ఫోన్‌ను చార్జింగ్ పెట్టి బెడ్‌పై విశాంత్రి తీసుకుంటుండగా మాయమైంది. అదే వార్డులో మరో మహిళ డిశ్చార్జి పత్రం కోసం వెళ్లి తిరిగొచ్చేలోపు ఫోన్ కనపడలేదు. రోగి బంధువులు వెతుకుతుండగా దొంగలు అక్కడినుంచి జారుకోబోయారు. వీరిని గుర్తించి వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


త్రినాథ్ మృతదేహం

తవణంపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. తవణంపల్లె పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరబ్రాహ్మణపల్లె హరిజనవాడకు చెందిన గోవిందయ్య కుమారుడు త్రినాథ్(25) తన ఇంటి వద్ద పేపరు ప్లేట్లు తయారు చేసే యంత్రం మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు, బంధువులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుతాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. త్రినాథ్ తండ్రి గోవిందయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-మదనపల్లె మార్గంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. పుంగనూరు మండలంలోని సుగాలిమిట్ట పంచాయతీ పెద్దతాండాకు చెందిన తిప్పానాయక్ కుమారుడు రెడ్డెప్పనాయక్ (50) ద్విచక్రవాహనంలో ఇంటికెళుతుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొని గాయపడ్డాడు. బాధితుడిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సంక్షిప్తంగా..

13, 14 తేదీల్లో ముత్యాలమ్మ జాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తేనెబండలోని ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 13, 14 తేదీల్లో జాతర నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకటరాయలు, ఉత్సవ నిర్వాహక సభ్యుడు యుగంధర్ బాబు తెలిపారు. శనివారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.

వన వేణుగోపాలుడికి పూజలు



వెదురుకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

కలికిరికొండ వెంకటేశ్వరుడి సేవలో ఎస్పీ దంపతులు



పెనుమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కలికిరి కొండ వేంకటేశ్వర స్వామిని శనివారం ఎస్పీ మణికంఠ దంపతులు దర్శించుకున్నారు. కొండపై ఉన్న స్వామివారి పాదాలకు పూజలు చేశారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భూసమస్యపై ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఇద్దరు గాయపడ్డారు. పుంగనూరు మండలంలోని మంగళం గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు అదే గ్రామానికి చెందిన చంద్రప్పలకు భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకటేశ్ భార్య శాంతమ్మపై చంద్రప్ప, సరోజమ్మ, శిల్ప దాడి చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కామాక్షమ్మ అడ్డువెళ్లడంతో ఆమెపై దాడి చేసి గాయపరిచారు.

ఆహ్లాదకరంగా 'నగర వనం'

వసతులు బాగున్నాయంటూ సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

వెదురుకుప్పం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): 'కార్వేటినగర వనం' ఆహ్లాదకరంగా మారింది. వైసీపీ పాలనలో ఇక్కడ వసతులను కల్పించకుండా గాలికొదిలేశారు. ఇదే విషయమై ఆంధ్రజ్యోతిలో ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీన 'అరకొర సౌకర్యాల నడుమ నగర వనం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ప్రభుత్వం వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. జిమ్ వినియోగంలోకి వచ్చింది. జారుడు బండ వద్ద సమస్యలు పరిష్కరించి, వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేశారు. సోలార్ లైటింగ్ సదుపాయమూ కల్పించారు. పచ్చదనం మెరుగవడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. దీంతో నగరవనాన్ని సందర్శించడానికి స్థానికులతోపాటు పర్యాటకులూ మొగ్గు చూపుతున్నారు. ఇది మంచి ప్రభుత్వం అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కార్వేటి నగరవనంలో ఊయలూగుతున్న చిన్నారులు - సేద దీరడానికి ఏర్పాట్లు - జిమ్ ప్రాంతంలో సందడి - ముఖద్వారం

పిల్లలు ఆడుకోవడానికి బాగుంది



నగరవనంలో వసతులు మెరుగుపడ్డాయి. ముఖ్యంగా పిల్లలు ఆడుకోవడానికి బాగుంది. జనం కూడా ముందుకన్నా ఎక్కువగా వస్తున్నారు.
- హారిక, తూర్పు వీధి, కార్వేటినగరం

చాలా సంతోషంగా ఉంది



పిల్లలు ఆడుకోవడానికిజారుడు బండ, జిమ్, ఊయల ఉన్నాయి. వాకింగ్ చేయడానికి అనువుగా ఉండటం చాలా సంతోషంగా ఉంది.
- మానస, కార్వేటినగరం

అన్ని వసతులు కల్పించాం



నగర వనంలో అన్ని వసతులు కల్పించాం. పర్యాటకుల సంఖ్య కూడా ప్రస్తుతం పెరిగింది.
- వెంకటసుబ్బయ్య, ఎఫ్ఆర్వో, కార్వేటినగరం